

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఇప్పటి నుంచే ఎమ్మెల్సీపై బీజేపీ గురి

- టికెట్ కోసం ప్రయత్నిస్తున్న సుగుణాకర్‌రావు, రాణి రుద్రమ
- అభ్యర్థిని గెలిపించుకోగలమని కమలనాథుల ధీమా



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

భారతీయ జనతా పార్టీలో పట్టభద్రుల ఎమ్మెల్సీ రాజకీయాల కదలిక ప్రారంభమైంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో ఆశావహులుగా ఉన్నవారు నెలరోజుల నుంచే పాత ఓటర్లను కలుస్తూ కొత్తగా ఓటర్లను చేర్పించేందుకు ఆయా ప్రాంతాల్లో తమ బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొని తాము రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్సీ స్థానానికి పోటీచేస్తామని మద్దతు కూడగడుతున్నారు. బీజేపీలో ఇంతకాలం ఆ ఊసు కనిపించలేదు. సెప్టెంబరు 30 నుంచి ఓటర్ల నమోదు కార్యక్రమం ప్రారంభం కానుండడంతో బీజేపీ ఆశావహులు కూడా ముందుకు వచ్చి తమ అభ్యర్థిత్వ ప్రతిపాదనను నాయకుల ముందు ఉంచుతున్నారు. బీఆర్ఎస్ నుంచి పలువురు పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని పార్టీ అధినేత ముందు తమ ప్రతిపాదనను ఉంచారు. వివిధ జిల్లాల్లో తాము పోటీ చేయనున్నట్లు అనుచరగణానికి, సన్నిహితులకు సంకేతాలిచ్చి ఆయా ప్రాంతాల్లో మద్దతుదారులను కూడగట్టుకుంటున్నారు. కాంగ్రెస్ నుంచి నాయకులు తమ ఆసక్తిని సన్నిహితులతో వ్యక్తం చేస్తూ పరిస్థితిని అంచనా వేస్తున్నారు. బీజేపీ ఇక్కడ అభ్యర్థిని రంగంలోకి దించి సీరియస్‌గా తలపడాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. నియోజకవర్గ పరిధిలో నలుగురు ఎంపీలు, ఏడుగురు ఎమ్మెల్యేలను గెలిపించుకున్న ఆ పార్టీ ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకోవడం కష్టమేమీ కాదని భావిస్తున్నట్లు తెలిసింది.



విద్యావంతుల్లో

బీజేపీ సానుకూల వాతావరణం ఉండడం, విద్యార్థి దశ నుంచి ఏబీవీపీలో ఉంటూ బీజేపీ రాజకీయ అవగాహనను పెంచుకున్న పలువురు గ్రాడ్యుయేట్లు ఈ నాలుగు జిల్లాల్లో ఉండడంతో వారి మద్దతు ఓట్లు తమకు అనుకూలంగా ఉంటాయని కమలనాథులు భావిస్తున్నారు. బీజేపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీల్లో బండి సంజయ్‌కుమార్ కేంద్రహోంశాఖ సహాయమంత్రిగా ఉండగా, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి బీజేపీ శాసనసభా పక్ష నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ నియోజకవర్గ పరిధిలోని నలుగురు ఎంపీలు, ఏడుగురు ఎమ్మెల్యేలతోపాటు శాసనసభస్థానాల్లో పోటీచేసి ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్న వారికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని గెలిపించే బాధ్యత అప్పగించాలని భావిస్తున్నట్లు తెలిసింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీని గెలుచుకోవడం ద్వారా నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో పార్టీని పటిష్టం చేసుకోవచ్చని భావిస్తున్న నాయకత్వం ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించింది.

నియోజకవర్గ పరిధిలో నలుగురు ఎంపీలు, ఏడుగురు ఎమ్మెల్యేలు

● **సన్నాహాలు చేసుకుంటున్న నాయకులు**

బీజేపీ సీనియర్ నాయకుడు, కిసాన్ మోర్చా మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి పొల్సాని సుగుణాకర్‌రావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ పోటీ చేయడానికి ఆసక్తి చూపిస్తూ సన్నాహాలు చేసుకుంటున్నట్లు తెలిసింది. పార్టీ పెద్దల మద్దతునుకూడగట్టుకోవడానికి వారివురు ఇప్పటికే ప్రయత్నాలను ప్రారంభించారని సమాచారం. వీరిద్దరిలో పార్టీ నాయకత్వం ఎవరివైపు మొగ్గుచూపుతుందో వీరిద్దరిని కాదని, మరే అభ్యర్థులను తెరపైకి తెస్తుందో వేచి చూడాల్సిందే. ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పార్టీ పక్షాన నిర్వహించి ఆ తర్వాతే అభ్యర్థుల ఎంపికపై పార్టీ నాయకత్వం దృష్టి సారిస్తుందని అంటున్నారు.

వైభవంగా కృష్ణాష్టమి



అశోక్‌నగర్ గీతామందిరంలో విశేషాలంకరణలో శ్రీకృష్ణుడు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 26: నగరంలోని దేవాలయాల్లో సోమవారం స్మార్త కృష్ణాష్టమి సందర్భంగా వైభవంగా పూజలు నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలతో సందడి చేశారు. ముద్దు మాటలతో, మురిపాల చేష్టలతో ఆనందంలో ముంచెత్తారు. ఇంటిల్లిపాది ఉపవాసాలు, జాగరణలు పాటించారు. సాయినగర్ మురళీకృష్ణ మందిరంలో సుందర సత్సంగ్ ఆధ్వర్యంలో గోపూజ, ఫలరసపంచామృత అభిషేక, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం చిన్నారులు కృష్ణుడు, రాధ, గోపికల వేషాలు ధరించి శోభాయాత్రలో పాల్గొన్నారు. అశోక్‌నగర్ మళయాళ సద్గురు గీతామందిరంలో మఠాధిపతి విష్ణుసేవానందగిరి స్వామి ఆధ్వర్యంలో అభిషేక అర్చనలు, అలంకారం, సహస్రనామార్చన, పుష్పయాగము, హవనం జరిగాయి. సాయంత్రం భజనలు, ప్రవచనం, శోభాయాత్ర, 108 రకాల నైవేద్యాలు, ఊంజల్‌సేవ నిర్వహించారు.

29న ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు ఆటల పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 26: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు ఈ నెల 29వ తేదీన ఆటల పోటీలను నిర్వహించనున్నారు. తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ వైస్ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించనున్నామని డీవైఎస్‌వో వి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

● మహిళల విభాగంలో 50 మీటర్లు రన్ అండ్ వాక్, 50 సంవత్సరాలు దాటిన వారికి, 100 మీటర్ల రన్ అండ్ వాక్, 50 సంవత్సరాల లోని వారికి నిర్వహించనున్నారు. షాట్‌పుట్, బ్యాడ్మింటన్, మ్యూజికల్ చైర్, చెస్, లెమన్ అండ్ స్పూన్, త్రోబాల్, టగ్ ఆఫ్ వార్ క్రీడలను నిర్వహించనున్నారు.

● పురుషుల విభాగంలో 50 సంవత్సరాలు దాటిన వారికి 50 మీటర్ల రన్ అండ్ వాక్, 50 సంవత్సరాల లోపు వారికి 100 మీటర్లు రన్ అండ్ వాక్, బ్యాడ్మింటన్, వాలీబాల్, చెస్, టగ్ ఆఫ్ వార్, ఖోఖో క్రీడల్లో పోటీను నిర్వహించనున్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 28వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు జాబ్ ఐడీ కార్డ్‌తో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. నమోదు చేసుకున్న వారికి 29వ తేదీన ఉదయం 9 గంటల నుంచి ఆటల పోటీలను స్టేడియంలో నిర్వహిస్తామని డీవైఎస్‌వో తెలిపారు. వివరాలకు 9640967943, 8008326913 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జోరుగా ఎన్‌హెచ్-563 పనులు

శరవేగంగా హుజూరాబాద్, శంకరపట్నం బైపాస్‌లు



హుజూరాబాద్ వద్ద నిర్వహిస్తున్న బైపాస్ రహదారి పనులు



హుజూరాబాద్ మండలం చిన్నపాపయ్యపల్లి వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి



హుజూరాబాద్ మండలం సింగాపూర్-కొత్తగట్టు మధ్యలో నిర్మిస్తున్న రహదారి పనులు

హుజూరాబాద్, ఆగస్టు 26: హుజూరాబాద్ నుంచి కరీంనగర్, వరంగల్‌కు వెళ్లాలంటే వాహనదారులు గతంలో తీవ్ర ఇబ్బందులు పడేవారు. 35 ఏళ్ల క్రితం నిర్మించిన కరీంనగర్-వరంగల్ రహదారి పూర్తిగా గుంతలమయమైంది. దీనిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్-563 ఫోర్‌లేన్ రహదారికి ఆమోదం తెలిపింది. ఎన్‌హెచ్-563 రహదారి పనులు ప్రస్తుతం జోరందుకున్నాయి. కిలోమీటర్ రహదారి నిర్మాణానికి రూ. 37 కోట్లు ఖర్చు పెట్టి పనులు చేస్తున్నారు. కరీంనగర్-వరంగల్ నాలుగు వరుసల రహదారి పనుల కోసం కేంద్ర ప్రభుత్వం సుమారు 16 వేల కోట్లకు పైగా నిధులు విడుదల చేసింది. ఈ రెండు జిల్లాల మధ్య 68 కిలో మీటర్ల మేర నిర్మిస్తున్న రహదారి పనులు ఊపందుకున్నాయి. వచ్చే ఏడాది జూలై నాటికి పూర్తి చేయాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) సూచించింది. భూసేకరణ గత ఏడాది నుంచే కరీంనగర్-వరంగల్ సెక్షన్‌లో పనులు మొదలయ్యాయి. భూసేకరణలో సమస్యలు ఎదురైనా వాటిని రెవెన్యూ అధికారులు రైతులతో మాట్లాడి పరిష్కరిస్తున్నారు. శంకరపట్నం మండలం కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయ సమీపంలో టోల్‌గేట్ పనులు జరుగుతున్నాయి. కెనాల్ బ్రిడ్జిపై వంతెనలు, కల్వర్టులు, మేజర్, మైనర్ జంక్షన్లు, బైపాస్ రోడ్డు పనులు చేస్తున్నారు. రోడ్లకు ఇరువైపులా ఎల్తైనా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. డ్రైవర్ల విశ్రాంతి కోసం ట్రక్ వే నిర్మిస్తున్నారు. హుజూరాబాద్, శంకరపట్నం మండలాల నుంచి వాహనాలు రాకతో ఇబ్బంది అవుతోందని తాడికల్ నుంచి మొలంగూర్ వరకు ఏడు కిలో మీటర్లు, సింగాపూర్ నుంచి చిన్నపాపయ్యపల్లి వరకు 15 కిలోమీటర్ల బైపాస్ నిర్మిస్తున్నారు. బైపాస్ పనులు 70శాతం వరకు పూర్తయ్యాయి. గ్రామాలు ఉన్న చోట ఇరువైపులా సర్వీస్ రోడ్లను వేస్తున్నారు. గతంలో వరంగల్-కరీంనగర్‌కు వెళ్లాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం రోడ్డు పనులు శరవేగంగా జరుగుతుండడంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులైన ఎస్జీటీలకు పదోన్నతులు కల్పిస్తాం

● **ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి**

కరీంనగర్ టౌన్, ఆగస్టు 26: జీవో ఎంఎస్ నంబర్ 11, 12ను సవరించి అర్హులైన ఎస్జీటీలకు ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం పదోన్నతులు కల్పిస్తామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన పీఆర్‌టీయు-టిఎస్ జిల్లాశాఖ సర్వసభ్య సమావేశం, జిల్లా కార్యవర్గ ఎన్నికలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పారిశుధ్య కార్మికుల నియామకం, ఉచిత విద్యుత్‌ను ప్రతి పాఠశాలకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరి ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం సభలో సీఎం రేవంత్‌రెడ్డితో ప్రకటన ఇప్పించగలిగామని అన్నారు. డీఎస్సీ-2003 ఉపాధ్యాయులను పాత పెన్షన్ పరిధిలోకి తీసుకువచ్చే బాధ్యత పీఆర్టీయూ తీసుకుంటుందని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు మాటాడుతూ ప్రత్యేక చొరవ తీసుకొని ఉపాధ్యాయులకు 25 వేల పదోన్నతులు ఇప్పించడంతోపాటు 30వేల బదిలీలు చేపట్టిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

● **జిల్లా అధ్యక్షుడిగా కరుణాకర్‌రెడ్డి**

అనంతరం జరిగిన జిల్లా కార్యవర్గ ఎన్నికల్లో ఒక్క అధ్యక్ష పదవికి హోరాహోరుగా పోరు జరిగింది. ప్రస్తుత అధ్యక్షుడు ముస్కు తిరుపతిరెడ్డిపై ఐలేని కరుణాకర్‌రెడ్డి ఒక్క ఓటుతో గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా మర్రి జైపాల్‌రెడ్డి, 15 మంది మిగతా కార్యవసభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా ఎల్ వెంకటేశ్వర్‌రావు, పి ప్రభాకర్‌రెడ్డి, వాణి, జిల్లా ఉపాధ్యక్షులుగా వి లక్ష్మీనారాయణ, ఎం శ్రీనివాస్‌రెడ్డి, కె రాంమోహన్‌రావు, వి రమాదేవి, కార్యదర్శులుగా ఎం పవన్‌కుమార్, కె శ్రీనివాస్‌రెడ్డి, సీహెచ్ సంజీవరెడ్డి, పి రాజేశ్వర్‌రెడ్డి, జె శ్యాంరాజ్, డి వనమాల ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు హన్మకొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మందల తిరుపతిరెడ్డి, శ్రీహరి ప్రకటించారు.

'విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి'

సుభాష్‌నగర్, ఆగస్టు 26: జిల్లాలో విష జ్వరాలు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ ఓ ప్రకనటలో కోరారు. విష జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉన్నందున జిల్లా వ్యాప్తంగా వైద్యులను అందుబాటులో ఉంచాలన్నారు. రోగులను ఇబ్బంది పెడుతున్న ప్రైవేట్ ఆసుపత్రులపై నిఘా పెంచాలన్నారు. జిల్లాలో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, చికున్‌గున్యా తదితర విష జ్వరాలు పెరిగిపోతున్నాయన్నారు.గ్రామపంచాయతీల్లో పారిశుధ్యం లోపించిందని తెలిపారు. కలెక్టర్, జిల్లా అధికారులు వెంటనే స్పందించాలని కోరారు.

బొమ్మలమ్మ గుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి



బొమ్మలమ్మగుట్ట వద్ద చరిత్ర పరిరక్షణ సమితి సభ్యులు

గంగాధర, ఆగస్టు 26: బొమ్మలమ్మగుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని చరిత్ర పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సందవేని తిరుపతి అన్నారు. తెలంగాణ చరిత్రాక ప్రాంతాల సందర్శనలో భాగంగా చేపట్టిన యాత్రలో సమితి సభ్యులు గంగాధర మండలం బొమ్మలమ్మగుట్టను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలో అత్యంత ప్రాచీన విద్యా కేంద్రాలో బొమ్మలమ్మ గుట్ట ఒకటని అన్నారు. ఇక్కడి త్రిభాషా శాసనంలోని తెలుగు కంద పద్యాల వల్లనే తెలుగు భాషకు ప్రాచీన హోదా దక్కిందన్నారు. గొప్ప వారసత్వ ప్రాచీన తెలుగు శాసనానికి నిలయమైన బొమ్మలమ్మగుట్టను పరిరక్షించుకోవాలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ ప్రాంతాన్ని తెలుగు వారందరూ తప్పకుండా సందర్శించాలన్నారు. ఇక్కడికి వచ్చే సందర్శకులకు ప్రభుత్వం సౌకర్యాలు కల్పించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాచీన చరిత్ర ప్రాంతాల ప్రాధాన్యాన్ని నేటి తరానికి పరిచయం చేస్తూ, కళాశాల స్థాయి విద్యాబోధనలో తప్పని సరిగా పాఠ్యాంశాన్ని చేర్చాలనే ఉద్దేశ్యంతో యాత్ర చేపట్టినట్లు తెలిపారు. యాత్రలో భాగంగా పొలాస, కోటిలింగాలు, మునులగుట్టను సందర్శించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో చరిత్ర పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రచార కార్యదర్శి కుందారపు సతీష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివాల భక్తర్, రామకృష్ణగౌడ్, తిరుపతి, అజేయ్, శంకర్, సాయికృష్ణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

● **ఆర్‌ఎం కార్యాలయం ఎదుట ఆర్టీసీ కార్మికుల ధర్నా**



ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు, కార్మిక నాయకుడు జక్కుల మల్లేశం

భగత్‌నగర్, ఆగస్టు 26: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కరీంనగర్‌లోని ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయం ఎదుట కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూయూ (ఐఎన్‌టీయూసీ) రాష్ట్ర వైస్ ఛైర్మన్, కరీంనగర్ రీజియన్ ఇన్‌ఛార్జి జక్కులమల్లేశం మాట్లాడుతూ రీజియన్ వ్యాప్తంగా ఉద్యోగులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. డ్రైవర్లకు బ్రీత్ అనలైజ్ టెస్టు డ్యూటీ చార్టులో సంతకం చేయక ముందే నిర్వహించాలని, ఆల్కహాలు పర్సెంటైల్ వస్తే డ్యూటీ ఇవ్వకుండా ఉండాలే తప్ప సస్పెండ్ చేయవద్దన్నారు. మహాలక్ష్మి కేసుల విషయంలో ప్యాసింజర్లు చేస్తున్న తప్పులకు సిబ్బంది బలవుతున్నారన్నారు. షెడ్యూల్ ప్రకారం 16 గంటలు డ్యూటీ చేస్తున్నా అదనపు ట్రిప్పులు చేయాలని అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రీజియన్ వ్యాప్తంగా చట్టవ్యతిరేకమైన డ్యూటీలు రద్దుచేయాలన్నారు. మహిళా కండక్టర్లకు రాత్రి ఎనిమిది గంటలలోపు అయిపోయే విధంగా డ్యూటీలు కేటాయించాలన్నారు. కరీంనగర్ రీజియన్‌లోని వివిధ డిపోలకు పంపిన ఉద్యోగులను తిరిగి జోనల్ వర్క్‌షాపుకు పంపించాలన్నారు. గ్యారేజీలో మెకానిక్‌లకు అసిస్టెంట్లను ఇవాలని, అవసరమైన టూల్స్ ఇవ్వాలన్నారు. గతప్రభుత్వం నియమించిన వెల్ఫేర్ బోర్డు కమిటీలను రద్దు చేయాలన్నారు. ప్రతి ఉద్యోగికి నెలలో మూడు రోజులు లీవ్ ఇవ్వాలి, మహిళా ఉద్యోగులకు అవసరం మేరకు అదనంగా లీవ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రీజినల్ అధ్యక్షుడు ఎస్కే రాజు, ఎస్‌జీ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

చీర మెడకు బిగుసుకుని మహిళ మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 26 : కొత్తపల్లి మండలం చింతకుంటకు చెందిన అవురకొండ లక్ష్మి(40) అనే మహిళ మద్యం మత్తులో చీర మెడకు చుట్టుకోగా ఉరి బిగుసుకుని మరణించిందని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. లక్ష్మి కొంత కాలంగా మద్యానికి అలవాటుగా మారి మద్యం కోసం కుటుంబ సభ్యులను వేధించేది. ఆదివారం ఉదయం నుంచి మద్యం సేవిస్తూ ఉంది. ఆమె భర్త, కూతురులు పని ఉందని బయటకు వెళ్లారు. మృతురాలి కూతురు వివాహం ఈనెల 28న జరగాల్సి ఉంది. పెళ్ళి ఖర్చులకు అప్పు కోసం బయటకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చే సరికి ముందు గదిలో లక్ష్మి బోర్లాపడుకుని ఉంది. నిద్రలేపితే మళ్లీ మద్యం కావాలంటుందనే కారణంతో భర్త, కూతురులు ఆమెను నిద్రలేపే ప్రయత్నం చేయలేదు. కొద్దిసేపటికి లక్ష్మి వద్దకు వెళ్లి చూడగా నాలుక కరుచుకుని ఉంది. స్థానికుల సహాయంతో పరిశీలించగా ఆమె మెడకు చీర బిగుసుకుని చనిపోయి ఉంది. మద్యం మత్తులో లక్ష్మి మెడకు చీరను చుట్టుకోగా అది బిగుసుకుని ఊపిరాడక మరణించిందని మృతుడి కూతు రు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బంగారు గొలుసు చోరీ..

తనిఖీ చేసిన పోలీసులు

తంగళ్లపల్లి, ఆగస్టు 26: బంగారు గొలుసు చోరీకి గురైందని ఓ మహిళ పేర్కొనడంతో తంగళ్లపల్లి మండల కేంద్రంలోని తాడూర్ చౌరస్తా వద్ద పోలీసులు బస్సును ఆపి తనిఖీ చేశారు. బాధితురాలి వివరాల ప్రకారం... సిద్దిపేట జిల్లాకు చెందిన పులగోని సౌజన్య ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో ఓ శుభకార్యానికి హాజరై స్వగ్రామానికి తిరిగి వెళ్తోంది. ఈక్రమంలో సిరిసిల్ల బస్టాండ్‌లో సిద్దిపేట డిపో బస్సు ఎక్కింది. తన బ్యాగులోని బాక్స్‌లో బంగారు గొలుసు భద్రపర్చుకుంది. తంగళ్లపల్లికి రాగానే బ్యాగు చూసుకున్న బాధితురాలు గొలుసు పోయిన విషయాన్ని డ్రైవర్‌కు చెప్పి బస్సును నిలిపివేసి పోలీసులకు సమాచారం అందించింది. తంగళ్లపల్లి పోలీసులు బస్సులోని ప్రయాణికులు, వారి బ్యాగులను తనిఖీ చేసినా ఫలితం లేకుండా పోయింది. ఈ విషయమై బాధితురాలు సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లింది.

కొండగట్టు ఆలయంలో ఏఈ పోస్టు ఖాళీ

నెల రోజుల క్రితం బదిలీపై వెళ్లిన అధికారి

మల్యాల, ఆగస్టు 26: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో ఇంజనీరింగ్ అధికారి పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడి ఏఈ లక్ష్మణ్‌రావు నెల రోజుల క్రితం సాధరణ బదిలీలలో బాగంగా వేములవాడ రాజరాజేశ్వ రస్వామి దేవస్థానానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కొత్త వారిని నియమించకపోవడంతో నెల రోజులుగా ఇంజనీరింగ్ పనులు నిలిచి పోయినట్లు అయింది. ఈ దేవస్థానం పరిధిలో ఇంజనీరింగ్ పరిధిలో ఏటా లక్షలాది నిధులతో కొత్త పనులు, మరమ్మతులు చేపడుతుంటారు. ఇవన్నీ ఇంజనీరింగ్ అధికారి పర్యవేక్షణలో కొనసాగుతుండగా నెల రోజులగా పనులు ముందుకు వెళ్లడం లేదని తెలుస్తోంది. ప్రతి సంవత్సరం హనుమాన్ చిన్న, పెద్ద జయంతులు, సమ్మక్క సారక్క జాతర సమయంలో ఇంజ నీరింగ్ శాఖ అధ్వర్యంలో పనులు సాగుతుంటాయి. ప్రస్తుతం ఏఈ లేక పోవడంతో ఇంజనీరింగ్ పనులు పడకేశాయి. దేవాదాయ శాఖ అధికారులు కూడా నెల రోజులుగా పట్టించుకోకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

● డీఈ స్థాయిలో నియమించాలి

కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం రోజురోజుకూ అభివృద్ధి చెందుతుండడంతో అందుకు తగిన అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకు గాను ఇక్కడ ఇంజనీరింగ్ శాఖ డీఈ స్థాయి అధి కారితో మరో ఏఈలను నియమించాల్సి ఉంది. ఇందుకు తగిన స్థాయి లో ప్రస్తుతం పనులు కొనసాగుతుండగా ఒక్క ఏఈ మాత్రమే పర్య వేక్షించారు. ఇప్పుడు ఏఈ కూడా లేని పరిస్థితి ఏర్పడింది. గతంలో చేప ట్టిన, చేపట్టబోయో పనుల కోసం ప్రత్యేక ఇంజనీరంగ్ అధికారు లను నియమించాల్సి ఉంది. ఈ విషయమై దేవస్థానం ఈవో రామ కృష్ణరావు ను వివరణ కోరగా ఏఈ పోస్టు ఖాళీ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని త్వరలోనే నియమించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

రాజన్న చెంత నిద్ర చేస్తానని..

● మరుసటి రోజు అనంతలోకాలకు

● ఆలయ పార్కింగ్ స్థలంలో వృద్ధురాలి మృతి

వేములవాడ కల్చరల్, ఆగస్టు 26: రాజన్నకు మొక్కుకున్నానని... నిద్ర చేసి వస్తానని.. కుటుంబ సభ్యులతో చెప్పి వారిని పంపించి మరుసటి రోజున ఓ వృద్ధురాలు అనంతలోకాలకు వెళ్లిన సంఘటన ఆ కుటుంబంలో విషాదాన్ని నింపింది. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ లోని ఎన్‌బీటీనగర్ పాటిగడ్డకు చెందిన వంగ లచ్చవ్వ (79) కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రాజన్న దర్శనానికి వచ్చింది. రాజన్నను దర్శనం చేసుకున్న అనంతరం తాను రాజన్న ఆలయంలో రెండు రోజులు నిద్ర చేస్తానని మొక్కుకున్నానని, మీరు వెళ్లండి అని కుటుంబ సభ్యులకు చెప్పి వారిని పంపించింది. శనివారం రాత్రి రాజన్న ఆలయంలో నిద్రించింది. ఆదివారం ఆలయ ఆవరణలో ఉంది. ఆదివారం రాత్రి కూడా ఆలయ ఆవరణలో నిద్రించింది. సోమవారం తెల్లవారు జామున రాజన్న ఆలయ పార్కింగ్ స్థలం లో మృతి చెంది భక్తులకు కనిపించింది. లచ్చవ్వ ఆదివారం రాత్రి కొంత అనారోగ్యానికి గురై బాధపడుతూ నిద్రించినట్లు భక్తులు తెలిపారు. లచ్చవ్వ వద్ద లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని ఆలయ అధికారులు తెలిపారు.

మోతె చెరువు కబ్జాకు యత్నం



అడ్డుకుంటున్న మత్స్యకారులు

జగిత్యాలరూరల్, ఆగస్టు 26: జగిత్యాల మండలంలో గల మోతె పెద్ద చెరువును ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) పరిధిలోని కొందరు వ్యక్తులు మట్టిపోసి కబ్జాలకు పాల్పడుతుండగా సమాచారం అందుకున్న మత్స్యకారులు సోమవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ రెండు రోజుల నుం చి ఎఫ్‌టీఎల్ పరిధిలో జేసీబీతో కొందరు మట్టి తీసి చెరువును కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం చెరువులను రక్షించాలని చెబుతున్నా అధికార దాహంతో కొందరు నాయకులు కబ్జాకు పాల్పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మోతె చెరువు కబ్జాకు గురికావడంతో మత్స్యకారులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటివరకు మోతె చెరువు ఎఫ్‌టీ ఎల్ పరిధిలోని సుమారు 20 ఎకరాల వరకు భూములను కబ్జా చేసి ఇళ్లు నిర్మించారని, దీంతో చెరువుల విస్తీర్ణం తగ్గిపోయిందన్నారు. కలెక్టర్ స్పందించి ఎఫ్‌టీఎల్ పరిధి నుంచి అక్రమ నిర్మాణాలను తొలగించాలని మత్స్యకారులు కోరుతున్నారు. హైడ్రా తరహాలో జిల్లాలో కూడా ఏర్పాటుచేసి చెరువులను రక్షించాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు.

కొనసాగుతున్న ఎత్తిపోతలు

● ప్రాజెక్టుల్లోకి పెరిగిన ఇన్‌ఫ్లోలు

పెద్దపల్లి/ధర్మారం/రామడుగు, ఆగస్టు 26: జిల్లాలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద ప్రవాహం పెరగడంతో మిడ్ మానేరుకు నంది పంప్‌హౌస్ నుంచి నాలుగు మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని ఎత్తి పోస్తున్నారు. సోమవారం ఉదయం వరకు 27,126 క్యూసెక్కుల ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు రాగా, అప్పటి వరకు మూడు మోటార్ల ద్వారా 9,450 క్యూసెక్కుల నీటిని తరలిస్తుండగా, మరొక మోటారును ఆన్ చేసి 12,600 క్యూసెక్కులకు పెంచారు. సాయంత్రం వరకు ఇన్ ఫ్లో 10,478 క్యూసెక్కులకు తగ్గింది. ఎన్టీపీసీ, హైదరాబాద్, జిల్లా తాగునీటి అవసరాలకు 452 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. మొత్తం ఔట్ ఫ్లో 13,052 క్యూసెక్కులు ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 17.758 టీఎంసీల నీళ్లున్నాయి. రామడుగు మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదల కొనసాగుతోంది. సోమవారం మూడు పంపుల ద్వారా 9,450 క్యూసెక్కుల నీటిని తరలించారు. సోమవారం నాలుగు పంపులతో నీటి విడుదలను కొనసాగించారు. నంది పంపు హౌస్ నుంచి ఇన్‌ఫ్లో తగ్గడంతో ఒక పంపును నిలిపివేశారు. ఇప్పటి వరకు గాయత్రి పంప్‌హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 20 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు.

ప్రాజెక్టుల నీటిమట్టం వివరాలు				
ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	24,073	3,822	80.5	57.316
ఎల్లంపల్లి	10,478	13,052	20.175	17.758
మిడ్ మానేరు	13,200	14,600	27.54	18.82
ఎల్ఎండీ	14,816	216	24.034	7.051

మిడ్‌మానేరుకు 13,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బోయినపల్లి: మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 11 వేలు, మూలవాగు మానేరు వాగు ద్వారా 2,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 18.82 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎల్ఎండీకి ఐదు గేట్ల ద్వారా 14,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 3,200 క్యూసెక్కుల నీటిని ఎత్తి పోస్తున్నారు.

ఏడు టీఎంసీలకు చేరిన ఎల్ఎండీ

తిమ్మాపూర్: కరీంనగర్ పరిధిలో దిగువ మానేరు జలాశ యంలో నీటి నిల్వ ఏడు టీఎంసీలు దాటింది. ఎంఎంఆర్ నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు 6063 క్యూసెక్కుల నీరు వచ్చింది. ఉదయం 9 గంటల సమయానికి 9,800 క్యూసెక్కులకు పెరిగింది. సాయంత్రం వరకు 14,600 క్యూసెక్కులకు పెరిగింది. ఎల్ఎండీ పూర్తిస్థాయి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా సోమవారం రాత్రి 9 గంటలకు 7.051 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎంఎంఆర్ నుంచి 14,600 క్యూసెక్కులు, మోయ తుమ్మెద వాగు నుంచి 216 క్యూసెక్కులు, మొత్తం 14,816 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. మిషన్ భగీరథ, ఇతర అవసరాల కోసం 216 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.


ధర్మారం మండలం నంది పంప్‌హౌస్ నుంచి విడుదలవుతున్న గోదావరి జలాలు

జమ్మికుంటలో

దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ ఎత్తివేత

30 ఏళ్లకు పైగా ఆగుతున్న రైలు

జమ్మికుంట, ఆగస్టు 26: వ్యాపార కేంద్రంగా ఉన్న జమ్మికుంటలోని రైల్వేస్టేషన్‌లో కొద్ది రోజుల క్రితం దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ ఎత్తివేశారు. హైదరాబాద్ నుంచి హజ్రత్ నిజాముద్దీన్ (12721), నిజాముద్దీన్ నుంచి హైదరాబాద్ (12722) వరకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లు గత 30సంవత్సరాలకు పైగా జమ్మికుంట రైల్వేస్టేషన్‌లో ఆగుతుండేది. ఇటీవల హాల్టింగ్ ఎత్తివేయడంతో ప్రయాణికులు అవస్థ లు పడుతున్నారు. జమ్మికుంట మండలంతో పాటు పరిసర మండలాలకు చెందిన గ్రామాల ప్రజలు ఇటు హైదరాబాద్ నుంచి కాగజ్‌నగర్ వరకు నిత్యం రాకపోకలు కొనసాగిస్తుంటారు. జమ్మికుంటకు చెందిన వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు హైదరాబాద్‌లో తమ పనులను ముగించుకొని రాత్రి సమయంలో హైదరాబాద్ నుంచి జమ్మికుంటకు చేరుకోవ డానికి దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ ఎంతో అనుకూలంగా ఉండేది. హాల్టింగ్ ఎత్తివేయడంతో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌కు జమ్మికుంటలో హాల్టింగ్ ఉన్నట్లు రైల్వే సమాచారాన్ని తెలిపే యాప్‌లలో చూపిస్తోంది. జమ్మికుంటకు చెందిన ప్రయాణికులు తర్వాత స్టేషన్ పెద్దపల్లిలో దిగి జమ్మికుంటకు చేరుకుంటున్నారు. కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ చొరవ తీసుకుని దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌ను జమ్మికుంట రైల్వేస్టేషన్లో హాల్టింగ్ సౌకర్యం కల్పించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.





సీఎంఆర్‌ఎఫ్ నకిలీ బిల్లులపై సీఐడీ విచారణ

ఉమ్మడి జిల్లాలో నాలుగు ప్రైవేట్ ఆసుపత్రులపై క్రిమినల్ కేసులు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 26: నకిలీ బిల్లులు చూపించి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) నుంచి అక్రమంగా కోట్ల రూపాయలు స్వాహా చేసిన ప్రైవేట్ ఆసుపత్రులపై సీఐడీ రాష్ట్ర వ్యాప్తంగా క్రిమినల్ కేసులు నమోదు చేసింది. గత ప్రభుత్వ హయాంలో నకిలీ బిల్లులతో కోట్ల రూపాయలు స్వాహా చేసిన కుంభకోణంలో ప్రైవేట్ ఆసుపత్రుల సిబ్బంది, రాజకీయపార్టీల నాయకులు, అధికారులున్నట్లు తెలిసింది. గత ప్రభుత్వంలో జరిగిన ఈ కుంభకోణంపై సీఎం రేవంత్‌రెడ్డి సీఐడీ విచారణకు ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన సీఐడీ పోలీసు అధికారులు విచారణను చేపట్టారు.

ఎమ్మెల్యేలకు సంబంధించిన నకిలీ లెటర్ ప్యాడ్‌లు, ఔషధాలు, ల్యాబ్ రిపోర్ట్‌లు, ఇతర పత్రాలకు సంబంధించి నకిలీ రశీదులు, పత్రాలతో కొందరు సీఎంఆర్‌ఎఫ్ బిల్లులు పొందారని సీఐడీ విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని నాలుగు ప్రైవేట్ ఆసుపత్రుల పై సీఐడీ క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిసింది. జమ్మికుంట (సప్తగిరి), పెద్దపల్లి (శ్రీసాయి), గోదావరిఖని ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆసుపత్రులపై క్రిమినల్ కేసులు నమోదు చేసిన సీఐడీ అధికారులు చర్యలకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. సీఐడీ అధికారులు ఇప్పటికే కొందరిని విచారించి వాంగ్మూలం రికార్డు చేసినట్లు తెలిసింది. కేసులు నమోదైన ఆసుపత్రుల్లో తనిఖీలు నిర్వహించిన సీఐడీ అధికారులు నకిలీ రశీదులు, ఇతర రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో కొందరు రాజకీయ నాయకులున్నట్లు తెలిసింది.

ఏడాదికాలంగా సీఎంఆర్ ఎఫ్ బిల్లులు పొందిన లబ్ధిదారుల జాబితా ప్రకారం ఉమ్మడి జిల్లావ్యా ప్తంగా ఉన్న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సీఐడీ అధికారులు విచారణ చేపట్టగా చాలా బిల్లులు నకిలీవని తేలినట్లు సమాచారం. కొన్ని కేసుల్లో వైద్యం పొందలేదని, వారి పేరిట వచ్చిన సీఎంఆర్‌ఎఫ్ బిల్లులో లబ్ధిదారులకు కొంత డబ్బులు అందజేసిన మధ్యవర్తులు మిగతా సొమ్ములు కాజేసినట్లు విచారణలో వెల్లడైందని తెలిసింది. ఆసుపత్రుల నిర్వాహకులు, సిబ్బంది ప్రమేయంపై లోతుగా విచారణ కొనసాగుతున్నది. ఈ కుంభకోణంతో ప్రమేయం ఉన్న వారిని త్వరలోనే అరెస్టు చేసే అవకాశముంది.

రెస్టారెంట్లలో

మున్సిపల్ అధికారుల సోదాలు

కోరుట్ల, ఆగస్టు 26 : పట్టణంలోని పలు రెస్టారెంట్లు, హోటళ్లలో ము న్సిపల్ అధికారులు సోమవారం సోదాలు నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ తిరుపతి ఆధ్వర్యంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలే అశోక్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. పలు రెస్టారెంట్‌లలో కుళ్లిపోయిన ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకుని వాటిని పట్టణ శివారులోని డంపింగ్ యార్డులో పూడ్చి పెట్టారు. పరిశుభ్రత పాటించని రెస్టారెంట్, హోటల్ యజమానులకు రూ. 32వేల వరకు జరిమానాలు విధించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తిరు పతి మాట్లాడారు. నాణ్యమైన ఆహారం విక్రయించాలని ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకొని తినుబండారాలను విక్రయించాలని అన్నారు. నాణ్యమైన ఆహారం విక్రయించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలను పాటించని నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది జగ్గల్ల రమేష్, జవాన్‌లు చిట్యాల గంగరాజం, రమేష్, చిట్యాల రాజుకుమార్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.


నిలువ ఉంచిన చికెన్


కుళ్లిపోయిన ఆహారాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

ఏసీబీ దాడులతో

రాజన్న ఆలయంలో దిద్దుబాటు చర్యలు

ఆలయంలోని 20 మంది ఉద్యోగుల అంతర్గత బదిలీలు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 26 : రాజన్న ఆలయంలో రెండు రోజుల క్రితం నిర్వహించిన ఏసీబీ దాడులతో ఆలయంలో ఈవో వినోద్‌రెడ్డి దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఆలయంలోని పలు విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న 20 మంది ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేస్తూ ఉత్తర్వులను విడుదల చేశారు. ఆలయంలో సెంట్రల్ గోదాం, గోశాల, టెంపుల్ సానిటేషన్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న నర్సయ్యను గోశాల, టెంపుల్ సానిటేషన్, హౌస్ కీపింగ్, అన్ని వసతి గదుల సానిటేషన్ మెయింటేనెన్స్‌కు బదిలీ చేశారు. సూపరింటెండింట్ అశోక్‌ను నిత్యాన్నదాన సత్రానికి, పార్కింగ్ సానిటేషన్‌కు బదిలీ చేశారు. మరో సూపరింటెండెంట్ సంతోష్‌ను అకౌంట్, సెంట్రల్ గోదాం సెక్షన్‌కు బదిలీ చేయగా, తొమ్మిది మంది సీనియర్ అసిస్టెంట్‌లను, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్‌లను, ఐదుగురు రికార్డు అసిస్టెంట్‌లను ఒక పరిచారికతో కలిపి మొత్తం 20 మంది ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేసినట్లు ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు.

కొడుకులు పట్టించుకోవడం లేదు

న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించిన వృద్ధురాలు

తిమ్మాపూర్, ఆగస్టు 26: తనను కొడుకులు పట్టించుకోవడం లేదంటూ ఓ వృద్ధురాలు పోలీసులను ఆశ్రయించింది. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ అలుగునూర్‌కి చెందిన నరసవ్వకు నలుగురు కుమారులు, ముగ్గురు కూతుళ్ల సంతానం. భర్త, ఓ కుమారుడు, ఓ కూతురు మరణించారు. భర్త చనిపోయిన తరువాత నరసవ్వ ముగ్గురు కుమారులు అంజయ్య, లక్ష్మణ్, రవి వద్ద రెండు నెలల చొప్పున ఉంటోంది. అయితే కొంత కాలం తరువాత వారి మధ్యలో బేదాభిప్రాయాలు రావడంతో ఎవరు కూడా తల్లిని చేరదీసేందుకు ముందుకు రాకపోవడంతో ప్రస్తుతం నరసవ్వ తన కూతురు వద్ద ఉంటోంది.

తనను కుమారులు చేరదీయడం లేదని ఆదివారం సాయంత్రం ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. ఎల్ఎండీ ఎస్సై చేరాలుకు తన గోడు వెళ్లబోసుకుంది. న్యాయం చేయాలని వేడుకుంది. ఎస్సై చేరాలు సోమవారం అలుగునూర్‌లోని వృద్ధురాలు వద్దకు చేరుకొని వివరాలు సేకరించారు. కుమారులతో మాట్లాడి నచ్చ చెప్పే ప్రయత్నం చేశారు. కుమారులు అందుబాటులో లేకపోవడంతో తిరిగి మంగళవారం మాట్లాడనున్నట్లు తెలిపారు. వృద్ధురాలికి న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామని లేకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై చేరాలు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మహిళాశిశు వికలాంగుల, వృద్ధుల సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎఫ్ఆర్ఓ రఫీయోద్దీన్ అలుగునూర్‌లోని నరసవ్వ ఇంటి వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ నరసవ్వకు అందుతుందని, వాటితోనే మందులను కొనుగోలు చేసుకుంటున్నట్లు నరసవ్వ తెలిపింది.


నరసవ్వ

ధర్మపురి క్షేత్రంలో శ్రావణ సందడి

ధర్మపురి, ఆగస్టు 26: శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో భక్త జన సందడి నెలకొంది. శ్రావణ మాసం నాలుగవ సోమవారం శివనామస్మరణలు చేసిన భక్తులతో క్షేత్రంలోని శివాలయాలు కిటకిటలాడాయి. సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించి అనంతరం ఆలయాలకు చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు శివుడికి జలాభిషేకం, బిల్వార్చన జరిపి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించారు. అక్కపెల్లి రాజ రాజేశ్వరునికి అన్న పూజ చేయించారు. సాయంత్రం రామలింగేశ్వర స్వామి వారల సేవ పురవీధుల గుండా నంది వాహనంపై ఊరేగింపు జరిపారు. దేవాలయాల్లో ఆలయ వేద పండితులు పాలెపు ప్రవీణ్‌శర్మ, బూస ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారలకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, డీసీఎం ఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఇందారపు రామయ్య, కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

భక్తులతో కిట కిటలాడిన శివాలయాలు


రామలింగేశ్వర స్వామి వారల సేవను ఊరేగింపు

కోటిలింగాలలో భక్తుల పూజలు

వెల్గటూర్: మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం కోటిలింగాల పార్వతీ కోటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ సోమవారం సందర్భంగా స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు పుష్కర ఘాట్లపై ఇసుకతో శివ లింగాలను చేసి పూజలు చేశారు. అనంతరం పార్వతీ కోటేశ్వర స్వామి ఆలయంలో స్వామిని దర్శించుకున్నారు. అనంతరం గర్భ గుడిలోని సైకత లింగాన్ని దర్శనం చేసుకున్నారు. ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మారుమోగింది. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం ఇచ్చారు.


జడ్జి నారాయణను ఆశీర్వదిస్తున్న అర్చకులు

స్వామివారిని దర్శించుకున్న జిల్లా జడ్జి

కోటిలింగాల శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామిని సోమవారం జిల్లా జడ్జి నారాయణ దర్శించుకున్నారు. స్వామి వారికి అర్చనలు అభిషేకాలు తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో కాంతారెడ్డి అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ, అన్వేష్ శర్మలు జడ్జికి శాలువా కప్పి సత్కరించారు. అర్చకులు ఆయనకు స్వామి ప్రసాదం అందజేసి ఆశీర్వచనాలు అందజేశారు.

పిల్లల ఆసుపత్రిలో వికటించిన ఇంజెక్షన్

బాలుడికి తీవ్ర అస్వస్థత

కోల్‌సిటీ, ఆగస్టు 26: గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని ఒక ప్రైవేట్ పిల్లల ఆసుపత్రిలో బాలుడికి ఇంజెక్షన్ వికటించింది. మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ బాలుడిని 15 రోజుల క్రితం లక్ష్మీనగర్‌లోని ఆసుపత్రికి తీసుకురాగా పిల్లల వైద్య నిపుణుడు పరీక్షించి ఇంజెక్షన్ ఇచ్చినట్టు బాధితులు పేర్కొన్నారు. ఇంటికి తీసుకెళ్లే సరికి ఒళ్లంతా పొక్కులు రావడంతో హుటాహుటిన కరీంనగర్‌కు తరలించి అక్కడ పరిస్థితి మెరుగు పడకపోవడంతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించామన్నారు. రూ.3లక్షలకు పైగా వ్యయం అయినట్టు బాధితులు శనివారం పేర్కొన్నారు. సంబంధిత ఆసుపత్రి నిర్వాహకులు రూ.50వేలు పంపించి మళ్లీ స్పందించడం లేదన్నారు. ఈ ఘటన పట్టణంలో చర్చనీయాంశం అయ్యింది.

అన్నపై కత్తితో దాడి

వేములవాడ రూరల్, ఆగస్టు 26 : అన్నపై తమ్ముడు కత్తితో దాడి చేసిన సంఘటన వేములవాడ రూరల్ మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని నమిలిగుండుపల్లికి చెందిన చెరుకు మహేందర్ రెడ్డికి అతడి తమ్ముడు చెరుకు శ్రీకాంత్‌రెడ్డికి సోమవారం డబ్బుల విషయంలో మాటామాట పెరిగి గొడవ జరిగింది. గొడవలో శ్రీకాంత్ అన్నపై కత్తితో దాడి చేశాడు. దాడిలో మహేందర్ రెడ్డికి స్వల్పంగా గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు మహేందర్‌రెడ్డిని ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జ్వరంతో వృద్ధుడి మృతి

కోనరావుపేట, ఆగస్టు 26: మండలంలోని మామిడిపల్లికి చెందిన మారు లక్ష్మారెడ్డి (75) సోమవారం జ్వరంతో మృతి చెందాడు. మామిడిపల్లికి చెందిన లక్ష్మారెడ్డి వద్ధాప్యంతో ఇంట్లోనే ఉంటున్నాడు. ఐదు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. కుటుంబసభ్యులు ఇంట్లోనే మందులు అందిస్తున్నారు. సోమవారం జ్వరం ఎక్కువవడంతో పరిస్థితి విషమించి మరణించాడు. లక్ష్మారెడ్డి కొద్దిరోజులుగా ఫిట్స్‌తో కూడా బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. లక్ష్మారెడ్డికి భార్య జనవ్వ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

డీజే సీజ్.. కేసు నమోదు

తంగళ్లపల్లి ఆగస్టు 26: అనుమతి లేకుండా డీజేను నడుపుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు, డీజేను సీజ్ చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి అనుమతి లేకుండా డీజే నడుపుతున్నారనే సమాచారం మేరకు దాడు లు నిర్వహించామని పేర్కొన్నారు. డీజే యజమాని దీరుపాల సతీష్, మరో ముగ్గురిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముస్తాబాద్, ఆగస్టు 26: ముస్తాబాద్ మండలం అవునూర్ గ్రామంలోని మూలవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం ఉదయం పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మోయినికుంట వద్ద పట్టుకున్నామని, ఇసుకను తరలిస్తున్న పులి రాకేష్, ప్రశాంత్, బోరివెల్లి భాస్కర్, ఈర్ల నరేష్‌ను అదుపులోకి తీసుకొని రెండు ట్రాక్టర్లను సీజ్ చేశామని పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

ఇల్లందకుంట, ఆగస్టు 26: మండలంలోని చిన్నకోమటిపల్లె గ్రామానికి చెందిన మూడెడ్ల సురేష్ (21) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సురేష్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 18న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి తండ్రికి ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే అతనిని జమ్మి కుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి అందించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం సాయంత్రం మెరుగైన చికిత్స కోసం హైద్రాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.


సురేష్ (ఫైల్)

కడుపునొప్పి భరించలేక విద్యార్థి..

వీణవంక, ఆగస్టు 26: కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని ఘన్ముక్ల గ్రామానికి చెందిన కాగిత సందీప్ (20) తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కొంత కాలంగా మానసిక స్థితి సరిగా లేకపోవడంతో పాటు తరచూ కడుపు నొప్పితో బాధపడుతూ కళాశాలకు వెళ్లడం లేదు. కడుపు నొప్పి భరించలేక ఆదివారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయడంతో జమ్మికుంటలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతుడి తండ్రి సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.


సందీప్ మృతదేహం

ఉరివేసుకుని యువతి ఆత్మహత్య

జూలపల్లి, ఆగస్టు 26. మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన దేవరాని సంకీర్తన (23) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. ఎస్ఐ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవరాని సంకీర్తన తల్లి సత్తమ్మ కొద్ది నెలల కితం మృతిచెందినది. తల్లి మృతిని తట్టుకోలేని సంకీర్తన తీవ్ర మనస్తాపానికి గురైనది. తన తల్లి లేకుండా బతుకలేనని తరచుగా కుటుంబ సభ్యులకు తెలిపేది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరివేసుకుని సంకీర్తన మృతి చెందింది. సంకీర్తన మృతిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

కమాన్‌పూర్, ఆగస్టు 26: మండలంలోని గుండారం గ్రామానికి చెందిన గాదె బాలయ్య తను పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఎస్ఐ కొట్టె ప్రసాద్ సోమవారం అందజేశారు. 2023 డిసెంబరు 10న కమాన్‌పూర్ నుంచి నాగారం గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా సెల్‌ఫోన్ పడిపోయింది. దీంతో మీ సేవ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ప్రత్యేక యాప్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీ కోసం అన్వేషించారు. ఇటీవల రాజస్థాన్‌లో సెల్ ఆచూకీ లభించింది. సెల్ లొకేషన్ ఆధారంగా ఫోన్‌ను ఉపయోగించిన వ్యక్తికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో సదరు సెల్‌ఫోన్‌ను కలిగిన వ్యక్తి కమాన్‌పూర్ పోలీసులకు సెల్‌ఫోన్‌ను పంపించారు. తొమ్మిది నెలల అనంతరం తన సెల్‌ఫోన్‌ను కనిపెట్టి అందజేసిన ఎస్ఐ, కానిస్టేబుల్ కొత్తపల్లి బాలకృష్ణకు బాలయ్య కృతజ్ఞతలు తెలిపారు.

శంకరపట్నం: సిరిసిల్లకు చెందిన ప్రముఖ కళాకారుడు ఆకునూరి దేవయ్య తన రూ. 80వేల విలువ గల స్మార్ట్‌ఫోన్ కేశవపట్నంలో పోయిందని పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేశవపట్నం ఎస్సై రవి దర్యాప్తులో సీసీ టీవీ పరిశీలనలో మొబైల్‌ని కనుక్కొని తిరిగి ఫిర్యాదుదారుడికి అప్పగించారు. ఫిర్యాదుదారుడు ఆకునూర్ దేవయ్య కేశవపట్నం ఎస్ఐకి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 26:మండలంలోని రాచర్ల గొల్లపల్లి బస్టాండ్ ప్రాంతంలో కామారెడ్డి సిరిసిల్ల ప్రధాన రహదారిపై సోమవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరికి గాయాలయ్యాయి. మండలంలోని పదర గ్రామానికి చెందిన వ్యక్తి గండికోట శ్రీనివాస్ తన బైక్ పై గొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో వాహనం అదుపుతప్పి పడిపోవడంతో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు మండల కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు.

మహాశక్తి ఆలయంలో ఛండీహోమం



ఛండీ హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 26: నగరంలోని చైతన్యపురి మహాశక్తి ఆలయంలో సోమవారం శ్రావణ బహుళ అష్టమి సందర్భంగా ఛండీహోమం నిర్వహించారు. మార్కండేయ పురాణంలోని 13 అధ్యాయాలతో కూడిన 700 మంత్రాలను పఠిస్తూ అర్చకులు హోమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఛండికా పరమేశ్వరుల ఆరాధనలతో క్షేమం చేకూరుతుందని వేద పండితులు అన్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

5న మేయర్ సునీల్‌రావు అమెరికా నుంచి రాక

కరీంనగర్ టౌన్, ఆగస్టు 26: వ్యక్తిగత పనుల నిమిత్తం ఈనెల 23న అమెరికాకు వెళ్లిన మేయర్ యాదగిరి సునీల్‌రావు సెప్టెంబర్ 5న అమెరికా నుంచి వస్తున్నట్లు మేయర్ క్యాంపు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సెప్టెంబర్ 5న బయలు దేరి 6వ తేదీ రాత్రి వరకు కరీంనగర్‌కు చేరుకుంటారని పేర్కొన్నారు. 14 రోజుల కంటే ఎక్కువ రోజులు అమెరికాకు వెళ్లిన సునీల్‌రావు ప్రభుత్వ అనుమతి తీసుకోకుండా నిబంధనలను ఉల్లంఘించారని, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించలేదని పలువురు నాయకులు ఆరోపణలు చేశారు. మేయర్ అమెరికా టూర్‌పై పాలకవర్గంలో చర్చోపచర్చలు జరపడం, కలెక్టర్‌కు కాంగ్రెస్ కార్పొరేటర్ ఫిర్యాదు చేయడం, డిప్యూటీ మేయర్ తనకు ఇంచార్జి బాధ్యతలు ఇవ్వాలని కోరారు. ఈనేపథ్యంలో మేయర్ సునీల్‌రావు తన తిరుగు ప్రయాణం విమాన టికెట్‌ను విడుదల చేసి ముందుగా చెప్పినట్లు 15రోజుల్లోనే కరీంనగర్‌లో ఉంటానని ప్రకటించడంతో చర్చకు తెరదించినట్లయింది.

ఫలపంచామృతాభిషేకం

కరీంనగర్ రూరల్, ఆగస్టు 26: కృతిక నక్షత్రం సందర్భంగా కరీంనగర్ మండలం నగునూరు గ్రామంలోని శ్రీ దుర్గాభవాని ఆలయంలో సోమవారం ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవల్లిదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి ఫలపంచామృతాభిషేకంతోపాటు ప్రత్యేక హారతులు, పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ఆయల వ్యవస్థాపకుడు వంగల లక్ష్మన్ భక్తులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 26: నగరంలోని భగత్‌నగర్ అంజ నాద్రిపై సోమవారం కృత్తికా నక్షత్రం సందర్భంగా అభిషేక, అలంకరణలు, విశేష పూజలు జరిగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకొని తరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

చెరువులు, కుంటలు ఆక్రమించిన వారిపై చర్యలు చేపట్టాలి

భగత్‌నగర్, ఆగస్టు 26: నగరంలో చెరువులు, కుంటలు ఆక్రమిం చిన వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు డిమాండ్ చేశారు. నగరంలో అనేక ప్రాం తాల్లో చెరువులు కుంటలు కబ్జాలమయమయ్యాయన్నారు. నగరాన్ని ఆనుకుని ఉన్న విలీన గ్రామాల్లో చెరువులు కుంటల్లో ఆక్రమ కట్టడాలు నిర్మించారన్నారు. లోయర్ మానేరు డ్యాంలో ఎఫ్‌టిఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయన్నారు. హైడ్రా లాంటి అథారిటి కరీంనగర్‌లో ఏర్పాటుచేస్తే ప్రజలు హర్షిస్తారన్నారు.

ఆర్టీసీ పార్సిళ్ల వేలం

భగత్‌నగర్, ఆగస్టు 26: కరీంనగర్ బస్టాండ్‌లో 40రోజులకు పైబడిన పార్సిళ్లను వేలం వేయనున్నట్లు ఆర్టీసీ లాజిస్టిక్స్ ఎటిఎం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్2 ఉదయం 11గంటలకు కరీంనగర్-1 డిపో గేట్ ముందు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

'కుల గణన తర్వాతే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి'

సుభాష్‌నగర్, ఆగస్టు 26: దళితుల కుల గణన తరువాతే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఉప కులాల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సిపిపాటి వేణు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగలు, ఉప కులాల పోరాటల ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందన్నారు. అధికార లెక్కల ప్రకారం మొత్తం 59 దళిత కులాల జనాభా 63 లక్షలు ఉంటుందన్నారు. అందులో మాల, మాదిగ కాకుండా మిగిలిన 57 ఉపకులాల జనాభా సుమారు 30 లక్షలు ఉంటుందన్నారు. ఉప కులాల కుల ధ్రువీకరణ పత్రాలు ఆర్‌డీవో ద్వారా పొందడం కష్టతరంగా మారడంతో ఎక్కువగా మాల, మాదిగ కులాలు జనాభా పెరిగినట్లు లెక్కలు చెబుతున్నాయన్నారు. తాము అనేక ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. ఈ సమావేశంలో కానుకుర్తి రాజేశ్, మార శంకర్, ఔషదం రవీందర్ పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలి

హుజూరాబాద్, ఆగస్టు 26: పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని చేయాలని అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్-సీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఊకంటి మహేందర్ అన్నారు. సోమవారం హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేబినెట్ సమావేశంలో ప్రవేశపెట్టిన భాగస్వామ్య పింఛన్ పథకం స్థానంలో కొత్తగా యూనిఫైడ్ పింఛన్ స్కీమ్‌ని అమలు చేయాలనే నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. పాత పెన్షన్ విధానాన్ని యధావిధిగా పునరుద్ధరణ చేయకపోతే కేంద్రంపైన ఉద్యమం తప్పదన్నారు.

కుంట కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



చంద్రవానికుంటను చూపిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుజూరాబాద్, ఆగస్టు 26: హుజూరాబాద్ పట్టణంలోని చెరువులు, కుంటల భూములను అక్రమంగా కబ్జా చేస్తున్నారని, వారిపై వెంటనే అధికారులు చర్య లు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు సొల్లు బాబు, కొలిపాక శంకర్‌లు అన్నారు. సోమవారం హుజూరాబాద్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో సాగు, తాగు అవసరాల కోసం మోడల్ చెరువు, గుండ్ల చెరువు, గంగోనికుంట, బట్టోనికుంట, చంద్రవాని కుంట తదితర కుంటలు గతంలో ఉండే వన్నారు. కుంటల స్థలాలను పలువురు కబ్జా చేసి ఇల్లు నిర్మించుకున్నారన్నారు. అధికారులు విచారణ జరిపి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పాఠశాలల్లో మండల స్థాయి క్రీడా పోటీలు

జమ్మికుంట రూరల్, ఆగస్టు 26: జమ్మికుంటలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఈ నెల 29నుంచి 31వ తేదీ వరకు మండల స్థాయి పాఠశాలల విద్యార్థులకు క్రీడోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, మండల ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శ్రీలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, అండర్ 17 బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయని, ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ పాఠశాలలోని జనన ధ్రువీకరణపత్రం,ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులు వెంట తీసుకురావాలన్నారు.

ఈద్గా, ఖబరస్థాన్, మసీద్ ప్రాంతాలను శుభ్రం చేయాలి

హుజూరాబాద్, ఆగస్టు 26: హుజూరాబాద్ మజీద్ కాంప్లెక్స్‌లోని ఈద్గా, ఖబరస్థాన్, ఐదు మసీదుల చుట్టూ పక్కల ప్రాంతాలను మున్సిపల్ అధికారులు, పాలకవర్గం శుభ్రం చేయించాలని జామే మజీద్, ఈద్గా, ఖబరస్థాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ అన్నారు. సోమవారం హుజూరాబాద్‌లోని ఈద్గా, ఖబరస్థాన్‌లను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. వర్షాకాలం కావడంతో చెట్లు పెరిగి ఈద్గా, మసీదులు పూర్తిగా అస్తవ్యస్తంగా మారాయన్నారు. ఖబరస్థాన్‌లో అంత్యక్రియలు నిర్వహించే సమయంలో ఆ ప్రాంతంలో పాములు కూడా సంచరిస్తున్నాయన్నారు. ఎలాంటి ప్రమాదం జరగకముందే మున్సిపల్ అధికారులు, పాలకవర్గ సభ్యులు వెంటనే స్పందించి శుభ్రం చేయాలని కోరారు.

కేశవపట్నంలో ఘనంగా సందల్ వేడుకలు

శంకరపట్నం, ఆగస్టు 26: మండలంలోని కేశవపట్నం గ్రామంలో సోమవారం హజరత్ సయ్యద్ జాకీర్ షాహిద్ రహమతుల్లాహి గంధం ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది గ్రామంలో మజీద్, దర్గా కమిటీ సదర్ ఖాజామైనుద్దీన్ (జాకీర్) జాఫర్, మన్సూర్, వాజిద్, ఇళ్ల నుంచి సందల్ తీసుకొని జెండాలను చేతబూని ఊరేగింపుగా డప్పుచప్పులతో దర్గాకు చేరుకున్నారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరిపి మదర్లపై చాదర్లను కప్పారు. కులమతాలకు అతీతంగా ఈ దర్గాకు కొంత మంది చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇస్మాముద్దీన్ జహంగీర్, మీర్జా ఆరిఫ్ బేగ్, ఆబిద్, ఇలియాస్, మోహిన్, ఫారూక్, అమీర్, మిర్జా జాకీర్ బేగ్, సల్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



శ్రీరాంనగర్ కాలనీలో వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు, వెలిచాల గ్రామంలోని సరస్వతి పాఠశాలలో ఉట్టి కొడుతున్న విద్యార్థులు, మానకొండూర్‌లో వేడుకలు, కరీంనగర్ రామేశ్వరాలయంలో శివలింగానికి మురళీకృష్ణుడి అలంకారం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 26: కృష్ణాష్టమి సందర్భంగా అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో సోమవారం ఉజ్వలపార్క్ వద్ద గల యాదవ భవన్‌లో శ్రీకృష్ణుని విగ్రహానికి పూజలు నిర్వహించారు. ఉట్టి వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతరం అన్నదానం జరిగింది. కార్యక్రమంలో మహాసభ జిల్లా కోర్ కమిటీ సభ్యులు సొగాని కొమురయ్య, కన్నెబోయిన ఓదేలు, నందనవేని మహేందర్, కార్పొరేటర్ ఐలేందర్‌యాదవ్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగారపు సత్యనారాయణ, నన్నెబోయిన రవి, చెర్ల పద్మ, కాల్వ లక్ష్మి, మంచాల రవీందర్, మానకొండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఓదేలు, బాసవేని మల్లేశం, కాల్వ శ్రీనివాసు, నగేశ్, జమ్మికుంట, ఇల్లంతకుంట, వీణవంక, కమలాపూర్, కొత్తపల్లి, గంగాధర, మానకొండూరు, చొప్పదండి, మండలాల అధ్యక్షులు శ్రీనివాస్, గడ్డి రాములు, మర్రి స్వామి, పోతరబోయిన రాజయ్య, పరశురాం, ఐలయ్య, నల్లెంకి కొమురయ్య, ఐలయ్య పాల్గొన్నారు.

●నగరంలోని జాన్సన్ గ్లోబల్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

●స్మార్త కృష్ణాష్టమి సందర్భంగా కమాన్ రోడ్‌లోని రామేశ్వరాలయంలో శివలింగానికి మురళీ కృష్ణుని అలంకారం చేశారు. విశేషాలంకరణలో ఉన్న శివయ్యను భక్తులు దర్శించుకొని తరించారు.

● కరీంనగర్‌లోని శ్రీరాంనగర్ కాలనీ రోడ్ నెం-2 కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.

●**సుభాష్‌నగర్:** కృష్ణాష్టమిని పురస్కరించుకుని సాయిబాబా ఆలయంలో లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320జి రీజియన్ 8జోన్-2 లయన్ చింతల కిషన్‌పటేల్ ఎంజెఎఫ్ ఆధ్వర్యంలో పులిహోర అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. కార్యక్రమంలో దేవాయలం పూజారి మూర్తి, కొడిమ్యాల శ్రీకాంత్, చింతల శివాని, తదితరులు పాల్గొన్నారు.

●**హుజూరాబాద్:** పట్టణంలోని బృందవన్ చౌరస్తాలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్టి కొట్టేందుకు యువకులు పోటీ పడ్డారు. కృష్ణాష్టమి సందర్భంగా చిన్నారులు గోపికలు, కృష్ణుడి వేషధారణలు పలువురిని ఆకట్టుకున్నాయి.

●**జమ్మికుంట:** పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. గీతామందిర్‌లో శ్రీకృష్ణుడికి అభిషేకాలు, పంచామృతాలు, విశేష పూజలు, గీతాపారాయణం, కుంకుమార్చనలు నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపిక వేషాధారణలతో అలరించారు. గాంధీ చౌరస్తాలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు.

●**గంగాధర:** గంగాధర మండలంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో యూత్ ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమంలో పెద్ద ఎత్తున యువత పాల్గొన్నారు.

●**చిగురుమామిడి:** మండలంలోని అన్ని గ్రామాల్లో, మండల కేంద్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను జరుపుకున్నారు. పలు గ్రామాల్లో ఉట్టి వేడుకలను జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

●**రామడుగు:** మండల వ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. వెలిచాల గ్రామంలోని సరస్వతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు గోపిక-కృష్ణుడి వేషాధారణలో వచ్చారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉట్టిని కొట్టేందుకు విద్యార్థులు పోటీపడ్డారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్, కో కరస్పాండెంట్ ఉప్పుల సత్యం తదితరులు ఉన్నారు.

●**మానకొండూర్:** మండలంలోని పలు గ్రామాలలో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. గ్రామాలలో నిర్వహించిన ఉట్టికొట్టే కార్యక్రమాలలో యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మానకొండూర్‌లోని గడిమహల్ ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు, మాజీ జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

●**వీణవంక:** మండలంలోని పలు గ్రామాల్లో కృష్ణష్టామి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నర్సింగాపూర్‌లో హరిహర క్షేత్రం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉట్టి కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుని వేషధారణతో ఉట్టిని కొట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు సన్మానం

కరీంనగర్ టౌన్, ఆగస్టు 26: పదోన్నతులు పొందిన పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులను వీఎంఆర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సోమవారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగ మహేందర్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలో పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలోని దేవునూరు, అల్లీపూర్ తదితర పాఠశాలల్లో పనిచేసి లండారంలో వీఆర్ఎస్ తీసుకున్నానని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌యుపిపిటి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.అబ్దుల్లా, ఎండి.జహంగీర్, స్వామి, సతీష్, గంగారెడ్డి, కిరణ్, కరుణాకర్, చైతన్య, కనకయ్య, సమిదుల్లాఖాన్, వేల్పుల స్వామి, సత్యనారాయణ, శ్యాం, ఫాజిల్, హఫీస్, ఎ.సుజాత, సునీత, ప్రభాకర్ పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవకులకు సన్మానం

సుభాష్‌నగర్, ఆగస్టు 26: లయన్స్‌క్లబ్ మంకమ్మతోట ఆధ్వర్యంలో వాసర ఆసుపత్రిలో నలుగురు నిస్వార్థ సేవకులకు సన్మానం చేశారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు రావుఫ్ అఫ్జల్, సిస్టర్‌లు మమత, సుభాషిని, షబానాలను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బూర్ల విద్యాసాగర్, రవీందర్‌రాజు, విశ్వనాథం, నాగసముద్రం వాసరయ్య, లక్ష్మయ్య, జిల్లా కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆలయంలో పెద్దపల్లి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 26: నగరంలోని పాతబజార్ గౌరీశంకరాలయంలో సోమవారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు 11వ డివిజన్ కార్పొరేటర్ ఆకుల నర్మదా నరసన్నతో కలసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఈవో వుడుతల వెంకన్న, బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆది మల్లేశం, బొల్లం లింగమూర్తి, చెల్లోజు రాజు, గుర్రం భాస్కర్‌రెడ్డి, అంజికుమార్, అనిల్, జస్వంత్, తిరుపతి, రవి, రమేశ్ పాల్గొన్నారు.

'డిప్యూటీ మేయర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వాలి'



మాట్లాడుతున్న బీసీ సంఘాల నాయకులు

గణేశ్‌నగర్, ఆగస్టు 26: మేయర్ సునీల్‌రావు విదేశాలకు వెళ్లినందున డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి పటేల్ అన్నారు. బీసీ వర్గానికి చెందిన మహిళ కాబట్టే ఇన్‌చార్జ్ మేయర్‌గా బాధ్యతలు ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. సోమవారం నగరంలో విలేకరుల సమావేశంలో బీసీ సంఘాల నాయకులు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి పటేల్, రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మల్లేశంలు మాట్లాడుతూ మేయర్ తన వ్యక్తిగత పర్యటన కోసం విదేశాలకు వెళ్లినపుడు నిబంధనల ప్రకారం డిప్యూటీ మేయర్‌ను ఇంచార్జ్‌గా నియమించాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు గుట్ల శంకర్, తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర పెంట అజయ్ పటేల్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటేశ్వర్ పాల్గొన్నారు.

'ధాన్యం కొనుగోళ్లలో కోట్ల రూపాయల కుంభకోణం'



మాట్లాడుతున్న మాజీ మేయర్ రవీందర్‌సింగ్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 26: ధాన్యం కొనుగోళ్లలో కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ ఆరోపించారు. సోమవారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోళ్లలో పదకొండు కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందనే ఆరోపణలున్నాయని అన్నారు. ధాన్యాన్ని సేకరించేందుకు టెండర్లు నిర్వహించారని అన్నారు. ఒక బస్తాకు రెండు వేల రెండు వందల ఇరవై మూడు రూపాయలు అయితే అదనంగా మరో రెండు వందలు వసూలు చేస్తున్నారని విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు అందని గృహజ్యోతి పథకం



చిగురుమామిడి, ఆగస్టు 26: మండలంలో గృహజ్యోతి పథకం పూర్తి స్థాయిలో అందకపో వడంతో లబ్ధిదారులకు తిప్పలు తప్పడం లేదు. దాదాపు అన్ని గ్రామాలకు సంబంధించిన లబ్ధిదా రులు గృహజ్యోతి పథకం కోసం ప్రభుత్వ కార్యాల యాల చుట్టూ తిరుగుతున్నారు. మండల వ్యాప్తంగా గృహజ్యోతి పథకం కోసం 18వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఇప్పటి వరకు 12 వేల మందికి మాత్రమే గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్ లబ్ధిపొందుతున్నారు. ఇక మండల వ్యాప్తంగా ఆరు వేల మంది లబ్ధిదారులకు లబ్ధి అందడం లేదు. అలాగే గ్యాస్‌కు సంబంధించిన సబ్సిడీ చాలా మందికి రావడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాల యాల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు సైతం చేసేది ఏమీ లేక మా చేతుల్లో లేదని అంటున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక సమస్యతో కొంత మంది లబ్ధిదారుల దరఖాస్తులను తీసుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. కానీ ప్రభుత్వం ఓ వైపు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి గృహజ్యోతి పథకం ద్వారా లబ్ధి జరుగుతుందని అందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని అంటున్నారు, కానీ ఆచరణ మాత్రం నోచుకోవడం లేదని మండల ప్రజలు అధికారులు, ప్రభుత్వ తీరుపై విమర్శలు చేస్తున్నారు. అర్హులైన అందరికీ లబ్ధిఅందేలా అధికారులు, ప్రభుత్వ పెద్దలు ప్రత్యేక కృషిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయలి

నాగెల్లి లక్ష్మారెడ్డి,

సీపీఐ మండల కార్యదర్శి

మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన లబ్ధిదారుల సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలి. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన లబ్ధిదారు లకు నేటికి లబ్ధి చేకూరడం లేదు. మండల వ్యాప్తం గా దాదాపు ఆరువేల మందికి లబ్ధి అందాల్సి ఉన్నది. ఇప్పటికైనా అధికారులు, అధికార పార్టీకి చెందిన ప్రభుత్వ పెద్దలు సమిష్టిగా కృషి చేసి అర్హులైన లబ్ధిదారులకు లబ్ధి అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 26: మండలంలోని రంగాపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సోమవారం రాత్రి పేకాట శిబిరంపై పోలీసులు దాడులు జరిపి పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. సీఐ తిరుమల్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పేకాట శిబిరంపై దాడి జరుపగా నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు గుర్తించారు. వారి వద్ద నుంచి రూ. 5400ల నగదు, పేకాట ముక్కలను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సభ్యత్వ నమోదు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మలాదేవి

జమ్మికుంట రూరల్, ఆగస్టు 26: సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిర్మలాదేవి అన్నారు. సోమవారం జమ్మికుంటలో బీజేపీ పట్టణ అధ్యక్షులు జీడి మల్లేష్ అధ్యక్షతన సభ్యత్వ నమోదు చేపట్టారు. ముఖ్యతిథిగా హాజరైన నిర్మలాదేవి మాట్లాడుతూ ప్రతి ఆరు సంవత్సరాలకు ఒకసారి సభ్యత్వ నమోదు ఉంటుందని, సభ్యత్వం నమోదు చేసుకోవడం ప్రతి కార్యకర్త తమ హక్కుగా భావించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎరబెల్లి సంపత్‌రావు, పల్లపు రవి, కొమ్ము ఆశోక్, మోడం రాజు, బచ్చు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ రాస్తారోకో



జమ్మికుంటలో రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

జమ్మికుంట, ఆగస్టు 26: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను పూర్తిగా విస్మరించిందని నిరసిస్తూ పట్టణ అధ్యక్షులు జీడి మల్లేష్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ చౌరస్తాలో సోమవారం రాస్తారోకో చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు ఎరబెల్లి సంపత్‌రావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి రైతులకు అనేక హామీలు ఇచ్చారని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా విస్మరించారన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రెండు లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. 45శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15వేలు, రైతు కూలీలకు రూ.12వేలు ఇస్తామన్న డబ్బులు ఏమయ్యాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్, పుల్లూరి రవి, ఠాగూరు రాజేష్, కైలాసకోటి గణేష్, కొలగాని రాజు, మోతే స్వామి తదితరులు పాల్గొన్నారు.

వాగ్దేవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో గోసేవ

సుభాష్‌నగర్, ఆగస్టు 26: కృష్ణాష్టమి సందర్భంగా వాగ్దేవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో గోసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం నగరంలోని గిద్దెపెరుమాళ్ల ఆలయంలో గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ గవర్నర్ జంద్యం మాదవి మాట్లాడుతూ గోవులను పాలించేవాడు కాబట్టి కృష్ణుడిని గోపాలుడని పిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మెన్ సొగాని కొమురయ్య క్లబ్ అధ్యక్షురాలు మాడిశెట్టి ఉమాదేవి, సభ్యులు మాధవి, అనిత, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతు బంధుపై రసమయి ద్వంద్వ వైఖరి

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 26 : రైతు బంధు పథకం కింద మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు కూడా లబ్ధి పొందారని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి కార్యదర్శి గోపు మల్లారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కుటుంబం రైతు బంధు సాయం పొందుతున్నారంటూ రసమయి యాగీ చేస్తున్నారన్నారు. మరి ఆయన కుటుంబం కూడా రైతు బంధు సాయం పొందుతున్నారని అన్నారు. ఈ విషయాన్ని బాలకిషన్ విస్మరించడం విడ్డూరంగా ఉందని మల్లారెడ్డి విమర్శించారు.

ఆరెకటిక సంఘం బలోపేతానికి కృషి

సుభాష్‌నగర్, ఆగస్టు 26: ఆరెకటిక సంఘం బలోపేతం కోసం కృషి చేయాలని ఆరెకటిక సంఘం బాధ్యులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక జ్యోతినగర్‌లోగ ఎం బాంకెట్‌హాలులో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. గ్రామస్థాయిలో సంఘం బలోపేతం కోసం త్వరలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్ జనార్దన్, జె మల్లోజి, ఎ సంతోస్, ఎ రవి, కె కృష్ణతోపాటు 16 మండలాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలి

మానకొండూర్, ఆగస్టు 26 : మండలంలోని ఊటూర్ సహకార సంఘంలో తీసుకున్న రుణం మాఫీ అయ్యేలా చొరువ తీసుకోవాలని లక్ష్మీపూర్ గ్రామ రైతు ఎడ్ల మల్లయ్య అధికారులను కోరారు. మానకొండూర్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సహకార సంఘంలో రూ. 90వేల రుణం తీసుకున్నట్లు తెలిపారు. సంఘం పాలకవర్గం తప్పిదం వల్ల తనకు రుణం రాకుండా పోయిందన్నారు. ఈ విషయంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా సిబ్బంది తప్పిదం వల్ల పొరపాటు జరిగిందని పాలకవర్గం 20 రోజుల సమయం కోరినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికైనా పాలకవర్గం ప్రత్యేక చొరువ తీసుకొని రుణమాఫీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వైద్య పరీక్షలు చేసుకోవాలి

శంకరపట్నం, ఆగస్టు 26: జ్వరాల బారిన పడ్డ ప్రజలు వెంటనే శంకరపట్నం మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని కొత్తగట్టులో ఓ వ్యక్తికి డెంగ్యూ పాజిటివ్ కేసు నమోదైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల వైద్య బృందం జిల్లా ఆంటీ మలేరియల్ బృందం కొత్తగట్టులో డెంగ్యూ పాజిటివ్ కేసు నమోదైన ఇంటి చుట్టు పక్కల సుమారు 50ఇళ్లల్లో డ్రైడే నిర్వహించారు. డెంగ్యూ వ్యాధికి సంబంధించి లార్వాలు దోమల నిర్మూలనకు పైరిత్రం స్ప్రే చేశారు. మండల ప్రజలు అనారోగ్యం బారిన పడ్డట్లయితే వెంటనే వైద్య పరీక్షలు చేసుకోవాలని తెలిపారు.

విద్యుదాఘాతంతో మూగజీవాల మృతి

శంకరపట్నం, ఆగస్టు 26: మండలంలోని కరీంపేటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మూగజీవాలు విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందాయి. స్థానికుల సమాచారం మేరకు... కరీంపేట నుంచి మొగిలిపాలెం వెళ్లే దారిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చింతం సాంబయ్యకు చెందిన పాడి గేదె, భైరి లక్ష్మయ్యకు మేక విద్యుదాఘాతంతో మృతి చెందాయి.

సెల్‌ఫోన్‌ల అప్పగింత

తిమ్మాపూర్, ఆగస్టు26: మండలంలోని ఎల్‌ఎండీ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న నాలుగు సెల్‌ఫోన్‌లను పోలీసులు గుర్తించి సంబంధిత వ్యక్తులకు సోమవారం అప్పగించారు. సిఈఐఆర్ అప్లికేషన్ ద్వారా గుర్తించి వాటిని సంబంధిత వ్యక్తులకు అందించినట్లు తిమ్మాపూర్ సీఐ స్వామి తెలిపారు. ఎవరిదైనా సెల్‌ఫోన్ పోతే సిఈఐఆర్ అప్లికేషన్‌ను ఉపయోగించుకోవాలని దానిపై అవగాహన పెంచుకోవాలని సిఐ తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

గన్నేరువరం, ఆగస్టు 26: మండలంలోని మైలారం గ్రామానికి చెందిన కాదసి ఎల్లస్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా సోమవారం స్థానిక మాజీ సర్పంచ్ దుడ్డు రేణుక మల్లేశం బాధిత కుటుంబాన్ని పరామర్శించి పదివేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వొడ్నాల నర్సయ్య, మైసంపల్లి తిరుపతి, బండి రాములు పాల్గొన్నారు.